జేఈఈ మెయిన్స్‌లో విద్యార్థి ప్రతిభ



గౌతంనగర్: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో గౌతంనగర్ డివిజన్‌లోని మల్కాజిగిరి భాష్యం స్కూల్ విద్యార్థి చరణ్‌తేజ టాపర్‌గా నిలిచాడు. 99.8/100 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచిన అతడిని స్కూల్ సీఈఓ చైతన్య, జెడ్ఈవో మార్కండేయులు, ప్రిన్సిపాల్ కోమలి అభినందించారు.

ప్యాచ్‌వర్క్స్ పరిశీలన



మల్లాపూర్: మల్లాపూర్ డివిజన్ పరిధిలో స్వామివివేకానందనగర్ కాలనీలో ప్యాచ్‌వర్క్స్‌ను గ్రేటర్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అనిల్‌కుమార్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. రోడ్డుపై ఉన్న గుంతలను పూడ్చివేయడంతో ప్రమాదాలను నివారించవచ్చన్నారు. మిగిలిన కాలనీల్లో కుడా ప్యాచ్ పనులను చేపట్టాలని సూచించారు.

పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శాంతి

మల్లాపూర్: నాచారం అంబేద్కర్‌నగర్ నుంచి కార్తికేయనగర్ వెళ్లేదారిలో పోచమ్మ గుడి వద్ద రూ.70 లక్షలతో నిర్మిస్తున్న వంతెన స్లాబ్ పనులను గురువారం నాచారం కార్పొరేటర్ శాంతి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. డీఈ బాలకృష్ణ, ఏఈ కీర్తి, వర్క్ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్, బీఆర్ఎస్ నేతలు కట్ట బుచ్చన్న, భూపాల్‌రెడ్డి, నర్సింగ్‌రావు, భాను, స్వామి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు అండగా సీఐటీయూ పోరాటం

మల్లాపూర్: రాష్ట్ర వ్యాప్తంగా ఒకేసారి కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేసిన ఘనత సీఐటీయూకే దక్కుతుందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు, ఉపాధ్యక్షులు ఎర్ర అశోక్, గణేష్ అన్నారు. గురువారం మల్లాపూర్ డంపింగ్‌యార్డు సమస్యల పరిష్కారానికి యూనియన్ ప్రధాన కార్యదర్శి రమేష్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు హాజరై మాట్లాడారు. సీఐటీయూ యూనియన్ ఆధ్వర్యంలో జీహెచ్ఎంసీ వ్యాప్తంగా 42 చోట్ల స్టాక్ యార్డులో జెండాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్మికుల పక్షన సీఐటీయూ నిలబడి పోరాడుతుందని స్పష్టం చేశారు. కార్మికులు భాస్కర్, రమేష్, సమ్మన్న, రాజేష్, అశోక్, గణేష్, మాధవ్ తదితరులున్నారు.

స్టేట్ వాలీబాల్ మహిళా జట్టు కెప్టెన్‌గా సుధాకీర్తి



అల్వాల్: ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ టోర్నమెంట్ పోటీలు నేటి నుంచి ఈనెల 18వ తేదీ వరకు చెన్నైలో జరగనున్నాయి. ఈ టోర్నమెంట్‌కు తెలంగాణ స్టేట్ సివిల్ సర్వీసెస్ వాలీబాల్ మహిళా జట్టు కెప్టెన్‌గా ఐసీడీఎస్ అల్వాల్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ సుధాకీర్తి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సుధాకీర్తి ఎన్నికవ్వడంపై ఐసీడీఎస్ ప్రాజెక్టు సిబ్బంది ఆమెకు అభినందనలు తెలిపారు.

వైభవంగా శ్రీకృష్ణ ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు



బోడుప్పల్: శ్రీకృష్ణ దేవాలయం వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవ ఆరంభ స్నపనం, విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, స్వస్తి పఠణం, విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, మృత్సం గ్రహణం, అంకురారోపణం, నివేదన ఏకాంత సేవ కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు పన్నాల కృష్ణారెడ్డి, ఆలయ చైర్మన్ అంజి పటేల్ పాల్గొన్నారు.

ట్రా‘ఫికర్’!



ఉత్తమ్‌నగర్ చౌరస్తాలో..

- సిగ్నల్స్ ఏర్పాటు చేయకపోవడంతో తరచూ ప్రమాదాలు
- క్రమబద్ధీకరించాలని కోరుతున్న వాహనదారులు

గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు. గత కొంతకాలం క్రితం సఫిల్‌గూడ రైల్వేగేటును పూర్తిగా మూసివేయడంతో అటు సికింద్రాబాద్ ఏఓసీ మీదుగా వచ్చే వాహనాలు, ఇటు మల్కాజిగిరి నుంచి వచ్చే వాహనాలతో ఉత్తమ్‌నగర్ చౌరస్తా పద్మవ్యూహాన్ని తలపిస్తోంది. మల్కాజిగిరి, వినాయక్‌నగర్, ఆనంద్‌బాగ్ నుంచి వచ్చే వాహనాలు సికింద్రాబాద్ వరకు పలు ప్రాంతాలు చిరకాలంగా రక్షణశాఖ, రైల్వే కార్యకలపాలకు కేంద్ర బిందువులుగా నిలుస్తున్నాయి.

రక్షణశాఖ రహదారులే దిక్కు..

రక్షణశాఖకు చెందిన స్థావరాలు కంటోన్మెంట్ బోర్డు పరిధిలో కొనసాగుతున్నాయి. మల్కాజిగిరి ప్రాంతంలో జనావాసాలు పెరగడంతో రక్షణశాఖకు చెందిన కార్యాలయాలకు చేరే రహదారులే ఆయా కాలనీవాసులకు శరణ్యంగా మారాయి. ఓ వైపు సఫీల్‌గూడ రైల్వేగేటు మూసేయడంతో ఉత్తమ్‌నగర్‌లో గతంలో నిర్మించిన ఆర్‌యూబీ మీదుగా వాహనాల రాకపోకలు సాగిస్తున్నాయి. రోజుకు సుమారు వేల సంఖ్యలో ఉత్తమ్‌నగర్ మీదుగా వాహనాల రాకపోకలు ఉంటున్నాయి.



సాయినగర్ చౌరస్తా మూలమలుపు వద్ద.. ఇబ్బంది పడుతున్న వాహనదారులు..

ఉత్తమ్‌నగర్ చౌరస్తాలో రోజూ ఉదయం సాయంత్ర వేళల్లో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. దీనికి తోడు సఫీల్‌గూడ రైల్వేగేటు మూసేయడంతో చిరువ్యాపారులు సైతం రోడ్డు పక్కన వ్యాపారాలు చేస్తుండటంతో నిత్యం వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పలువురు వాపోతున్నారు.

సాయినగర్ చౌరస్తాలో......

మల్కాజిగిరి, ఆర్కేనగర్, వాణీనగర్ మీదుగా సాయినగర్ చౌరస్తా నుంచి మిర్జాల్‌గూడ, లాలాగూడ, సికింద్రాబాద్‌కు వెళ్లే వాహనదారులు, సికింద్రాబాద్ నుంచి మల్కాజిగిరికి వచ్చే వాహనదారుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది. దీంతో సాయినగర్ చౌరస్తాలో ట్రాఫిక్ జామ్‌తో వాహనదారులు నరకయాతన అనుభవిస్తున్నారు.

అక్రమ పార్కింగ్‌తో అవస్థలు..

వ్యాపార సముదాయాలకు వచ్చే వారు రోడ్లపై వాహనాలను ఇష్టానుసారంగా పార్క్ చేస్తుండటంతో సమస్య జఠిలంగా మారుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఉత్తమ్‌నగర్, సాయినగర్ చౌరస్తాల్లో ట్రాఫిక్ సిగ్నల్స్, ట్రాఫిక్ సిబ్బందిని ఏర్పాటు చేయాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.

సిబ్బందిని నియమిస్తాం

గౌతంనగర్ డివిజన్ పరిధిలోని సాయినగర్ చౌరస్తా, ఉత్తమ్‌నగర్‌లలో రద్దీ వేళల్లో వాహనాలను క్రమబద్ధీకరించేందుకు సిబ్బందిని నియమిస్తాం. పూర్తి స్థాయిలో పర్యటించి వాహనదారులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటాం. చౌరస్తాల వద్ద ట్రాఫిక్ సిగ్నళ్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం.

– నర్సింహులు, మల్కాజిగిరి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఉప్పల్: పారిశ్రామికవాడ జెర్సీ 11 కేవీ ఫీడర్ మరమ్మతుల కారణంగా శుక్రవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి 3 గంటల వరకు సాగర్ ఏయిర్ కంపెనీ, ఎల్ఎన్‌నగర్, ఈఎస్ఐ ఆసుపత్రి లేన్, ఐజేఎం, కేకేరావు ఇండస్ట్రీ, పద్మజ ప్రింటర్స్, ఉప్పల్ పారిశ్రామికవాడ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ కిరణ్ కుమార్‌రెడ్డి తెలిపారు.

◆ హబ్సిగూడ ఫీడర్ మరమ్మతుల కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ గణేష్ తెలిపారు.

11 కేవీ గ్రీన్‌హిల్స్ కాలనీ ఫీడర్ పరిధిలోని వీధి నెంబర్–8లో ఉదయం 10.30 గంటల నుంచి 1.30 వరకు వసంత్ విహార్ కాలనీ, లేన్‌నంబర్ 1 నుంచి 9 వరకు హబ్సిగూడ ఫీడర్ ఎన్జీఆర్ఐ ఫీడర్ పరిధిలో ఉదయం 10.30 గంటల నుంచి 12 గంటల వరకు ఉప్పల్ స్టేడియం మెట్రోస్టేషన్, ఎన్జీఆర్ఐ మెట్రోస్టేషన్, వీధినెంబర్–7 హబ్సిగూడ మెయిన్‌రోడ్డు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

◆ ఐఎస్ఐ ఫీడర్ మరమ్మతుల కారణంగా వీధి నెంబర్–8లో మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 4.15 నిమిషాల వరకు బృందావన్‌కాలనీ, స్నేహనగర్, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఉప్పల్: పారిశ్రామికవాడ జెర్సీ 11కేవీ ఫీడర్ మరమ్మతుల కారణంగా శుక్రవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు సాగర్ ఏయిర్ కంపెనీ, ఎల్ఎన్‌నగర్, ఈఎస్ఐ ఆసుపత్రి లేన్, ఐజేఎం, కేకేరావు ఇండస్ట్రీ, పద్మజ ప్రింటర్స్, ఉప్పల్ పారిశ్రామికవాడ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ కిరణ్ కుమార్‌రెడ్డి ప్రకటించారు.

మేడిపల్లి: సమ్మర్ యాక్షన్ ప్లాన్ నిమిత్తం 11 కేవీ కెనరానగర్ ఫీడర్ 33/11 కేవీ పీఅండ్‌టీ కాలనీ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 11.00 గంటల నుంచి మధ్యాహ్నం 2.00 గంటల వరకు పీఅండ్‌టీ కాలనీ, బుద్ధానగర్, కెనరానగర్‌లలో కరెంట్ ఉండదని విద్యుత్ ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు.

◆ సమ్మర్ యాక్షన్ ప్లాన్ నిమిత్తం 11 కేవీ బుద్ధానగర్ ఫీడర్ పరిధిలో 33/11 కేవీ పీఅండ్‌టీ కాలనీ సబ్‌స్టేషన్ పరిధిలో మధ్యాహ్నం 3.00 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు పీఅండ్‌టీ కాలనీ, బుద్ధానగర్, మల్లికార్జుననగర్, వరంగల్ హైవేలలో కరెంటు ఉండదని ఏఈ హరినాథ్ సగ్గు ఓ ప్రకటనలో తెలిపారు.

బోడుప్పల్: దేవేందర్‌నగర్‌లో ఫీడర్ మెయింటెనెన్స్ పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు ఏఈ వినయ్‌కుమార్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. దేవేందర్‌నగర్, అంబేడ్కర్‌నగర్, గౌతమినగర్, రాజీవ్‌నగర్, అన్నపూర్ణ కాలనీ, వీరారెడ్డికాలనీ, ఇందిరానగర్, జ్యోతినగర్ కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

నీటి సరఫరాలో సమస్యలు తలెత్తకుండా చర్యలు



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బండారి, కార్పొరేటర్ ప్రభుదాస్

కుషాయిగూడ: తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా సమర్థవంతంగా నిర్వహించేలా చూడాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి వాటర్‌వర్క్స్ అధికారులను ఆదేశించారు. కృష్ణానగర్ కాలనీలో తాగునీటి మెయిన్ పైపులైన్ మరమ్మతు పనులను గురువారం స్థానిక కార్పొరేటర్ ప్రభుదాస్, వాటర్‌వర్క్స్ అధికారులతో కలిసి పరిశీలించారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. వాటర్‌వర్క్స్ చీఫ్ మేనేజర్ నాగేందర్, డిప్యూటీ జనరల్ మేనేజర్ సతీష్, ఏఈ వేణుగోపాల్, స్థానిక నేతలు ప్రభాకర్‌రెడ్డి, నరేందర్, నిసార్ అహ్మద్‌గోరి తదితరులు పాల్గొన్నారు.

షబ్బే బరాత్‌కు ఏర్పాట్లు

ఉప్పల్: చిలుకానగర్ డివిజన్ పరిధిలో షబ్బే బరాత్ ఉత్సవాల సందర్భంగా ముస్లింలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు కార్పొరేటర్ బన్నాల గీతాప్రవీణ్‌ముదిరాజ్ తెలిపారు. గురువారం చిలుకానగర్ డివిజన్ పరిధిలోని ఖబ్రస్థాన్‌లో కమిటీ అధ్యక్షులు అబ్బుబాయ్ విజ్ఞప్తి మేరకు ఖబ్రస్థాన్‌లో పిచ్చిమొక్కలను తొలగించారు. దీంతో పాటు వీధిదీపాలను సైతం ఏర్పాటు చేయనున్నట్లు కార్పొరేటర్ తెలిపారు.

బీజేపీ చర్లపల్లి డివిజన్ అధ్యక్షుడిగా ప్రభాకర్

కుషాయిగూడ: బీజేపీ చర్లపల్లి డివిజన్ అధ్యక్షుడిగా కుషాయిగూడకు చెందిన చల్ల ప్రభాకర్ నియమితులయ్యారు. ఈ మేరకు ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ గురువారం ఆయనకు నియామకపత్రాన్ని అందజేసి అభినందించారు. తనపై విశ్వాసంతో డివిజన్ పార్టీ బాధ్యతలు అప్పగించిన బీజేపీ పార్టీకి రుణపడి ఉంటానన్నారు. బీజేపీ నేతలు నాదం, ఆనంద్‌గౌడ్, నర్సింగ్‌రావు, లక్ష్మణ్‌గౌడ్, సహదేవ్‌గౌడ్, శ్రీకాంత్, నవీన్, శ్రీనివాస్, రాంబాబు, నాగమణి, రామకృష్ణ, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

అల్వాల్: అల్వాల్ డివిజన్ పరిధిలోని గౌతమ్ మోడల్ స్కూల్ వెనుక మురుగునీటి వ్యవస్థ మూసివేతపై జరిగిన ఫిర్యాదుతో కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డి అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. సమస్యను అంచనా వేసి, అనుమతి కోసం ప్రతిపాదన పంపాలని ఆమె అధికారులకు సూచించారు. జలమండలి మేనేజర్ కృష్ణమాచారి, నాయకులు శేఖర్, ఇమ్రాన్, ప్రేమ్, యాదగిరి, సాజిద్, కాలనీవాసులు పాల్గొన్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ శాంతి

దళితుల భూ సమస్యలు పరిష్కరించాలి



సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న రాములు

బోడుప్పల్: బోడుప్పల్‌లోని దళితుల అసైన్‌మెంట్ భూములకు పరిష్కారం చూపాలని కోరుతూ ఫెడరేషన్ చైర్మన్ రాపోలు రాములు గురువారం జూబ్లీహిల్స్ నివాసంలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. దళిత కుటుంబాలకు చెందిన 300 ఎకరాలకు పైగా అసైన్‌మెంట్ భూమిని గత ప్రభుత్వం ల్యాండ్ పూలింగ్ కింద ఒప్పందం చేసుకుని పరిష్కారం చూపలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వమైన తమ భూ సమస్యలకు పరిష్కారం చూపాలని వినతిపత్రంలో కోరారు. దీనిపై సీఎం సానుకూలంగా స్పందించినట్లు ఆయన చెప్పారు.

ఎన్యుమరేటర్ల వేతనాల్లో జాప్యం!



- కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు
- ప్రభుత్వం నుంచి రాలేదంటున్న అధికారులు

బోడుప్పల్: నగర పాలక సంస్థ పరిధిలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లుగా పనిచేసిన వారికి ప్రభుత్వం నుంచి వేతనం ఇవ్వడంలో జాప్యం చేస్తోంది. 2024 నవంబర్ మొదటి వారం నుంచి డిసెంబరు మొదటి వారం వరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ సర్వేను చేపట్టింది. నగర పాలక సంస్థ పరిధిలో 327 మంది ఎన్యుమరేటర్లు, 32 మంది సూపర్‌వైజర్లు, 150 మందిని డేటా ఎంట్రీ ఆపరేటర్లుగా తీసుకున్నారు. డేటా ఎంట్రీ పనులు పూర్తికాగానే వారికి వేతనం అందజేశారు. ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లకు రెండు నెలలు కావస్తున్నా.. ఇప్పటి వరకు వేతనం ఇవ్వలేదు. దీంతో పలువురు రోజూ నగర పాలక సంస్థ కార్యాలయానికి వచ్చి అధికారులను కలుస్తున్నారు. తమ పనిపూర్తి కాగానే వేతనం ఇస్తామని అధికారులు చెప్పారని, రెండు నెలలు దాటినా ఇప్పటి వరకు వేతనాలు ఇవ్వలేదని మహిళా ఎన్యుమరేటర్లు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులను అడిగితే ప్రభుత్వం నుంచి నిధులు రాలేదని చెప్పారన్నారు. వేతనాలు చెల్లించకపోతే మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

విద్యార్థులు క్రీడాస్ఫూర్తిని కలిగి ఉండాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

బోడుప్పల్: విద్యార్థులు చదువుతోపాటు క్రీడాస్ఫూర్తిని కలిగి ఉండాలని అకడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. బోడుప్పల్ అకడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్ వార్షికోత్సవ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చదువుతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థుల్లో కళాభిరుచిని పెంపొందిస్తాయన్నారు. విద్య, క్రీడలు, సాంస్కృతిక రంగాలను ప్రోత్సహించేలా విద్యా సంవత్సరం సమగ్ర ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత స్థాయి విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో ఆకట్టుకున్నాయన్నారు. పాఠశాల టెక్నికల్ డైరెక్టర్ ఆఫ్ ఆపరేషన్స్ కౌశిక్‌రెడ్డి, ప్రిన్సిపాల్ నీలిమాదేవి, వైస్ ప్రిన్సిపాల్ ప్రసన్నలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ

కాప్రా: దివ్యాంగులకు క్యాడర్ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత కంప్యూటర్ శిక్షణను ఇస్తున్నారు. ‘అసోసియేషన్ పర్సన్ విత్ డిజేబిలిటీ బెంగళూరు’ వారి సహకారంతో శిక్షణను అందిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ హరిబాబు తెలిపారు. ఈసీఐఎల్‌లోని తమ సంస్థలో 45 రోజుల పాటు కంప్యూటర్ శిక్షణ అందించి, ఉద్యోగం కల్పించేలా కృషి చేస్తామన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన 18 ఏళ్ల నుంచి 35 ఏళ్లున్న వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తిగల వారు దరఖాస్తు చేసుకోవాలని, దూరప్రాంతాల వారికి ఉచితంగా హాస్టల్ వసతి కూడా కల్పిస్తున్నట్లు ప్రకటించారు. మరిన్ని వివరాలకు 9030777102, 6303605360.

ఇసుక లారీల యజమానుల ఆందోళన

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్న పోలీసులు



లారీల యజమానులతో మాట్లాడుతున్న పోలీసులు

కుషాయిగూడ: ఇసుక తరలింపులో ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన నిబంధనలతో ఇబ్బందులు పడుతున్నామంటూ ఇసుక లారీల యజమానులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వతీరుపై గురువారం వారు చక్రిపురం చౌరస్తాలో ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనలతో మైనింగ్, పోలీసు అధికారులు టిప్పర్లతో ఇసుక రవాణా చేయొద్దని ఆదేశిస్తున్నారని తెలిపారు. చిన్న చిన్న వీధుల్లోకి లారీలతో ఇసుక సరఫరా చేయడం ఎలా సాధ్యమవుతుందన్నారు. కొంత మేరకే ఇసుక అవసరమైన వారికి టిప్పర్లతో సప్లై చేయాల్సి ఉంటుందన్నారు. ప్రభుత్వ తాజా నిబంధనలతో ఇసుక లారీల యజమానులు వీధిన పడే పరిస్థితులు ఏర్పడుతున్నాయన్నారు. ప్రభుత్వ తీరుతో గత రెండ్రోజులు ఇసుక సరఫరా పూర్తిగా నిలిచిపోయిందన్నారు. ఇలాగే కొనసాగితే తమ జీవనోపాధి కోల్పోవడంతో పాటు బ్యాంకుల్లో రుణాలు కూడా చెల్లించలేని పరిస్థితులు వస్తాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

నిబంధనల మేరకే సప్లై చేయాలి..

లారీ యజమానుల ఆందోళన విషయం తెలుసుకున్న కుషాయిగూడ, చర్లపల్లి ఇన్‌స్పెక్టర్లు భాస్కర్‌రెడ్డి, రవికుమార్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణరాజు చక్రిపురం చేరుకుని ఇసుక లారీల యజమానులతో మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనల మేరకే ఇసుక సప్లై చేయాలని సూచించారు. అతిక్రమించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. టిప్పర్లతో ఇసుక తరలింపు విషయంలో రెవెన్యూ, మైనింగ్ అధికారులతో మాట్లాడుకోవాలన్నారు. ఇసుక లారీల యజమానులు రాంచందర్‌గౌడ్, బలవంతరెడ్డి, శివారెడ్డి, మల్లేష్, దిలీప్‌రెడ్డి, బాలనరసింహ, ప్రభాకర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మరొకరికి తీవ్ర గాయాలు

అల్వాల్: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా.. మరొకరు తీవ్రంగా గాయపడిన ఘటన అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్ రాష్ట్రానికి చెందిన శత్రుగన్‌కుమార్ శర్మ (30), రాహుల్‌కుమార్‌లు కార్పెంటింగ్ పని చేస్తూ బాలాజీనగర్‌లో నివాసం ఉంటున్నారు. కాగా గురువారం రాత్రి సమయంలో బాలాజీ నగర్ నుంచి తూంకుంటకు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా.. హకీంపేట నీసా వద్ద బస్సును ఓవర్‌టేక్ చేస్తుండగా.. బైక్ అదుపుతప్పి కింద పడటంతో శత్రుగన్ అక్కడికక్కడే మృతిచెందాడు. రాహుల్‌కుమార్‌కు స్వల్పంగా గాయాలయ్యాయి. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గైర్హాజరు నిందితుల రిమాండ్

ఘట్‌కేసర్: వాయిదాల ప్రకారం హాజరుకాని నిందితులను ఘట్‌కేసర్ పోలీసులు గురువారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. చార్జ్‌షీటులో ముద్దాయిలుగా ఉన్న పాశం యాదిరెడ్డి, పాశం పద్మపై మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా ఐదో అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ శిరీష నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేయడంతో పోలీసులు వారిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా.. న్యాయమూర్తి వారికి రిమాండ్ విధించారు.

తహసీల్దార్ ఎదుట బైండోవర్!

ప్రభుత్వ స్థలాలు కబ్జా చేస్తున్నాడని ఆరోపణలు



కాప్రా/కుషాయిగూడ: రెవెన్యూ అధికారులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మంత్రి లక్ష్మణ్‌పై అధికారులు చర్యలు తీసుకున్నారు. కాప్రా మండలం 199 సర్వే నంబర్‌లో 15 గుంటల ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారని తెలుసుకున్న రెవెన్యూ అధికారులు గత రెండ్రోజుల క్రితం పోలీసు బందోబస్తు మధ్య కూల్చివేతలు ప్రారంభించారు. ఆ సమయంలో మంత్రి లక్ష్మణ్ అనే వ్యక్తి ఇది తమ భూమి అని రెవెన్యూ అధికారుల విధులకు ఆటంకం కలిగించడమే కాకుండా వారిపై అనుచిత వ్యాఖ్యలు చేశారని అధికార వర్గాలు తెలిపాయి. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న అధికారులు కుషాయిగూడ ఇన్‌స్పెక్టర్ భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంత్రి లక్ష్మణ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గురువారం కాప్రా మండల తహసీల్దార్ సుచరిత ఎదుట అతడిని హాజరుపరిచారు. దీంతో సదరు వ్యక్తి గురించి తహసీల్దార్ ఆరా తీయడంతో ఇప్పటికే అతనిపై 10 పాత కేసులు ఉన్నట్లు గుర్తించామని తహసీల్దార్ వివరించారు. ప్రభుత్వ స్థలాలు కబ్జా చేశారనే కేసులు కూడా అతడిపై ఉన్నట్లు గుర్తించామన్నారు. ఈ విషయంలో రాచకొండ సీపీ సుధీర్‌బాబును కలిసి అతడిపై పీడీయాక్ట్ కూడా నమోదు చేయాలని కోరినట్లు తహసీల్దార్ వివరించారు.

అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం

మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్



రవికుమార్ కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

మల్లాపూర్: కుంభమేళా నుంచి తిరిగి వస్తూ.. జబల్‌పూర్ రోడ్డు ప్రమాదంలో నాచారం కార్తికేయనగర్‌కు చెందిన సురకంటి మల్లారెడ్డి, బోరంపేట్ సంతోష్‌కుమార్, రాంపల్లి రవికుమార్, రాఘవేంద్రనగర్‌కు చెందిన సోమావరం శశికాంత్, డ్రైవర్ రాజులు మృతి చెందిన విషయం తెలిసిందే. మృతుల అంత్యక్రియలు పూర్తికాగా.. కుంభమేళా నుంచి వచ్చిన ఎంపీ ఈటల రాజేందర్ నేరుగా నాచారం వచ్చి బాధిత కుటుంబాలను పరామర్శించారు. వారి కుటుంబసభ్యులకు ధైర్యం చెబుతూ.. తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్తికేయ నగర్‌కు శ్రీరామ్ బాలకిషన్ తలకు తీవ్రగాయం కావడంతో అక్కడే ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి, నాచారం డివిజన్ బీజేపీ అధ్యక్షులు నవీన్‌కుమార్, మల్లాపూర్ డివిజన్ అధ్యక్షులు గూడురు శైలేష్‌రెడ్డి, బీజేపీ నేతలు రాగిరి మోహన్‌రెడ్డి, నర్సింగ్‌రావు, ప్రకాష్, సత్యనారాయణ, రవినాయక్, గోపి తదితరులున్నారు.

ముగిసిన శశికాంత్ అంత్యక్రియలు

మృతుడి సోదరి అమెరికాలో ఉండటంతో జాప్యం



శశికాంత్ భౌతికకాయాన్నికి నివాళులర్పిస్తున్న బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్

మల్లాపూర్: కుంభమేళా నుంచి తిరిగొస్తూ రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన నాచారం రాఘవేంద్రనగర్‌కు చెందిన శశికాంత్ మృతదేహాన్ని గాంధీ మార్చురీ నుంచి గురువారం ఉదయం ఇంటికి తీసుకొచ్చారు. చివరి చూపుకోసం అమెరికా నంచి వచ్చిన మృతుడి చెల్లెలు శ్వేత సోదరుడి మృతదేహాన్ని చూసి బోరున విలపించింది. శశికాంత్ భార్య కల్యాణి ఇంటికి పెద్ద దిక్కు కోల్పోవడంతో ఏడ్చిన తీరు అందరిని కంటతడిపెట్టించింది. శశికాంత్‌కు ముగ్గురు పిల్లలు కాగా ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. ఆయన భౌతికకయానికి బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్వీఎస్ఎస్. ప్రభాకర్, మేడ్చల్ అర్బన్ జిల్లా అధికార ప్రతినిధి పోతగాని గోపాల్‌గౌడ్, నర్సింగ్‌రావు, కన్వీనర్ బాలచందర్, మోహన్‌రెడ్డి, నవీన్, ప్రకాష్ నివాళులర్పించారు. మల్లాపూర్ వైకుంఠధామంలో మధ్యాహ్నం అంత్యక్రియలు పూర్తి చేశారు.